

సంగీతపు జల్లు

కొలపల్లి ఈశ్వరరావు

"ఏమండోయ్! ఇటురండి! ఇక్కడ నే నొక్కదాన్నే వంట చెయ్యలేక ఛస్తున్నాను. కాస్త సహాయం చెయ్యండి!" అర్థింపుగా అడుగుతున్న భార్యవంక సుబ్బారావు జాలిగా చూశాడు.

వెంటనే రంగంలోకి వురికాడు. వంట కార్యక్రమం నిర్విఘ్నంగా ముగిసింది.

ఆ రోజు ఆదివారం. సుబ్బారావు తీరిగ్గా వుండే రోజు. భార్యభర్తలిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం అయిందనిపించారు.

పేపరు చూస్తున్న సుబ్బారావు లోపలున్న భార్యకు ఆర్డరిచ్చాడు—

"రత్నం వక్కాకు తీసుకురా"

భార్యా రత్నం వక్కాకు పళ్ళెంతో హాజరయింది. రత్నం ముఖం ఎందుకో వెలిగిపోతున్నది.

"ఏమిటి విశేషం" అన్నట్లు చూశాడు సుబ్బారావు భార్యవంక.

"ఏంలేదండి!" తమలపాకు చిలకలు అందిస్తూ సిగ్గుపడింది.

ఆడవాళ్లు తమకై తాము దగ్గరకు వచ్చారంటే, ఏదో వుండి వుంటుంది. సుబ్బారావు చిలిపిగా భార్యకళ్లల్లోకి చూశాడు. బరువుగా రత్నం కనురెప్పలు క్రిందకు వాలాయి, సుబ్బారావు చూపుల ధాటికి తట్టుకోలేక.

"అదికాదండీ! నేను ... నేను త్వరలో ...

మాట పూర్తి చెయ్యలేక పోయింది. సుబ్బారావు గుండెల మీద వాలిపోయింది. సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. ఆడవాళ్లు ఇంతగా సిగ్గుపడేది ఎప్పుడు? చెప్పవలసిన మాటలు నోటిలోనే వుంటాయి! కాని చెప్పలేరు! ఎదుటి వాళ్లే ఆ విషయాల్ని తెలుసుకోవాలి!!!

సుబ్బారావు మెదడు చురుగ్గా పనిచేసింది. ముఖం సంతోషంగా వెలిగింది.

"అమ్మదొంగా! నాకు చెప్పకుండా దాద్దామనుకున్నావా? నేనెలా కనిపెట్టేసేనో చూడు." సుబ్బారావు చిలిపిగా భార్యవంక చూశాడు.

తను చెప్పకుండానే ఆ విషయం భర్తకు ఎలా తెలిసిందోనని కంగారుపడుతున్న రత్నాన్ని—

"ఇంక నువ్వేం చెప్పకు! నేనేమి వినను! ఈ రోజు ఎంత సుదినం? నాకెంతో సంతోషంగా వుంది! రత్నం! వుండు ఇప్పుడే వస్తా" అంటూ ప్యాంటు వేసుకుని బజారు కెళ్లాడు.

'ఇన్ని' ప్యాకెట్లుతో తిరిగొచ్చాడు.

"ఏమిటండీ! ఇవన్నీ?" అంది రత్నం సగం ఆశ్చర్యంగా: సగం సంతోషంగా, ఆ ప్యాకెట్లలో చీరలుండటం గమనించి.

"ఏంలేదు లేవోయ్! ఇవన్నీ నీకే! ఊఁ దేవిగారు త్వరగా స్వీకరించాలి!"

అన్ని ప్యాకెట్లు విప్పి పెట్టాడు. రకరకాల స్వీట్సు, చీరలు, చిన్నపిల్లలాడుకునే బొమ్మలు! ఇంకా ... ఇంకా ...

ఇవన్నీ ఎందుకో రత్నానికి అర్థంకాలేదు ప్రశ్నార్థకంగా భర్తవంక చూసింది.

"ఏవిటే అలా బిత్తరపోయి చూస్తావు? ఇవన్నీ మనకే! చాలా ఖర్చయిందని బాధపడు

తున్నావా ? ఆ బాధలేం పెట్టుకోకు ! నువ్వింక నిశ్చింతగా, ఎప్పుడూ నవ్వుతూ, సంతోషంగా వుండాలి ! ఊఁ నోరు తెరు--'' ఒక స్వీటు తీసి రత్నం నోట్లో సగం పెట్టి తను సగం తీసుకున్నాడు.

భర్త ప్రేమకు, అనురాగానికి రత్నం పరవశించి పోయింది. అతని గుండెల మీదవాలి తృప్తిగా కళ్లు మూసుకుంది. సుబ్బారావు కౌగిలిలో రత్నం గువ్వలా వొదిగిపోయింది.

* * *

ఆ రోజు నుండి సుబ్బారావు బజారు నుండి ఏదో ఒకటి తెచ్చేవాడు. వాటిలో ముఖ్యంగా పిల్లల బొమ్మలుండేవి. రత్నానికి ఏం అర్థం కాలేదు. సుబ్బారావు అక్కయ్య వాళ్లు వస్తారేమో ! వాళ్ల పిల్లలు ఆడుకోటానికి తెస్తున్నాడేమోనని సరి పెట్టుకుంది.

సుబ్బారావు దిన చర్య పూర్తిగా మారిపోయింది. ఆఫీసుకు పోయేవరకు భార్యకు వంటపనిలో సహాయం చెయ్యటం, సాయంత్రం షికారుకో, సినిమాకో రత్నాన్ని త్రిప్పటం, ఏ హోటల్లోనో తృప్తిగా భోంచేసి ఇంటికి వచ్చి పడుకోవటం — ఇదీవరస !

రత్నాన్ని పెద్ద పెద్ద పనులు చెయ్యవద్దనేవాడు. "ఆ పనులన్నీ నేచేస్తా, మిగతా పనులు నువ్వుచూడు'' అంటూ ప్రతిపనిలో కల్పించుకునేవాడు.

రత్నానికి రోజులు సంతోషంగా, హాయిగా గడిచిపోసాగాయి.

ఇప్పుడు ఎన్నడూ లేనంతగా ఉత్సాహంగా వుంటుంది. రోజు రకరకాల పిండివంటలు చేసేది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోంచేసే వారు.

సుబ్బారావు ఒకరోజు పనిమనిషిని తీసుకుని వచ్చాడు. రత్నం కోప్పడింది.

"ఎందుకండీ ! ఇద్దరికి పనిమనిషి. ఈ మాత్రం పని నే చెయ్యలేనూ ? ! భర్తకు వండి పెట్టలేని ఆడదాని జీవితం ఎందుకు ? మనిద్దరము కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా మనకు కావలసినవి చేసుకుంటాము ! కాని ఈ పని మనిషి ఏం చేస్తుందో ఏమో ? అదీగాక మన మధ్య అడ్డం'' తెలుగు సినిమా హీరోయిన్‌లా వుపన్యాస మిచ్చింది రత్నం.

కాని, సుబ్బారావు ఒప్పుకోలేదు. "వీల్లేదు! నువ్వు మారు చెప్ప, పనిమనిషి వుండవలసిందే! నువ్వింక ఎక్కువ పని చేయుటం మంచిదికాదు. తరువాత బాధపడి ప్రయోజనం లేదు. ముందు జాగ్రత్త తీసుకోవటం మంచిది'' అటువంటి విషయాలు నీకన్నా నాకే బాగా తెలును అన్నట్లుంది సుబ్బారావు వాలకం.

ఐదు నెలలు ఇట్టే గడిచిపోయాయి. సుబ్బారావు, రత్నం ఎంతో సంతోషంగా కాలం వెళ్లబుచ్చసాగారు. "ప్రపంచంలో వున్న అన్యోన్యమైన దాంపత్యములలో మాది ఒకటి'' అన్నట్లు మెలగసాగారు. ఇరుగు పొరుగువారు ఈర్ష్య పడ్డారు.

ఒకసారి సుబ్బారావు తీరిగ్గా వున్నాడు. పేపరు చూస్తున్నవాడల్లా ఇటు తిరిగి రత్నం వంక తదేకంగా చూడసాగాడు.

సంగీతపు జల్లు

"ఏమిటి ? అలా చూస్తున్నారు ? కళ్లతోనే ప్రశ్నించింది రత్నం చిలిపిగా !

"ఏంలేదు !'' కళ్లతోనే జవాబిచ్చి పేపర్లో తల దూర్చాడు. అతని మెదడు ఆలోచించటం మొదలు పెట్టింది.

"ఇప్పటికి ఐదు నెలలు గడిచాయి ! రత్నం 'ఆ' వార్త చెప్పి ! కాని అటువంటి లక్షణాలు రత్నంలో కనపడటంలేదే ! సహజంగా ఐదు నెలలకు ఆడవాళ్లలో మార్పు కలుగుతుంది. ముఖం మునుపటికన్నా అందంగా వుండటం, బరువుగా నడవటం ... ఆ మార్పు లేమీ రత్నంలో రాలేదు. కారణం ఏమిటి చెప్మా ?''

తన సందేహాన్ని తీర్చుకునేందుకు భార్యా రత్నాన్ని పిలిచాడు,

"ఆఁ వస్తున్నా !'' అంటూ వంటింట్లో నుండి వచ్చి భర్త ప్రక్కన కూర్చుంది.

సుబ్బారావు పరిశీలనగా, కళ్లు ఇంతచేసి రత్నం వైపు చూశాడు.

"ఏమిటండీ ! ఇందాకటి నుంచి అలా చూస్తున్నారు ! నా ముఖంమీద మసిగాని వుందేమిటి ?'' ముఖాన్ని గట్టిగా రెండు చేతులతో తుడుచుకుంది.

ఎలా మొదలు పెట్టాలో సుబ్బారావుకు అర్థం కాలేదు ! ఏమని అడగాలి ? ఎలా అడిగితే బావుంటుంది ? సుబ్బారావు మెదడు చురుగ్గా పని చేసింది.

గబగబ లోపలికి వెళ్లాడు.

భర్త ప్రవర్తన అర్థంగాక నిలువు గుడ్లేసుకుని చూడసాగింది రత్నం !

అంతకు ముందు తెచ్చిన పిల్లల ఆట వస్తువులతో తిరిగి వచ్చాడు.

"ఎందుకండీ ! అవన్నీ ?'' ప్రశ్నార్థకంగా భర్తవంక చూసింది.

'చెప్తాగా' అంటూ కుర్చీలో కూర్చుని—"ఈ వస్తువులను ఎందుకు తెచ్చానో తెలుసా ? నీవు త్వరలో పాపాయిని అందిస్తావని.'' ఎలాగో పూర్తి చేశాడు సుబ్బారావు.

"ఇది మరీ బాగుందండీ ! మీ రివన్నీ తెచ్చారని నన్ను......'' ఆపై ఇంక చెప్పలేక పోయింది సిగ్గుతో.

"అయితే అటువంటి విశేషమేమి లేదన్న మాట !'' తను చేసిన ఖర్చు గుర్తు చేసుకుంటూ నిరాశగా అడిగాడు సుబ్బారావు.

"అటువంటి ఆశలేవీ పెట్టుకోకండి ! ఇప్పుడల్లాంటి విశేషాలు జరుగవు !'' తుర్రున వంటింట్లోకి దూరింది.

అంత పెద్ద మనిషి సుబ్బారావు నిలువునా నీరుకారి పోయాడు.

"అయ్యో ! దేముడా ! ఎంతపని చేశావురా ?'' రెండు చేతులు తలమీదుంచుకున్నాడు. కాని, వెంటనే ఆనాడు రత్నం సిగ్గుపడుతూ చెప్పబోయిన విషయం ఏమిటి అయి వుంటుందా ? అని—

"రత్నం'' మరలా పిలిచాడు.

"మళ్లీ ఏం వచ్చిందండీ ! ఈసారి మీరేమన్నా...'' పైటకొంగు చాటున నవ్వింది.

"నీకురాని విశేషం నాకు వస్తుందా ? అదినరే గాని ఇలారా, ఆ రోజు మరి నువ్వు సిగ్గుపడుతూ చెప్పబోయిన సంగతేమిటి ?'' ఆఖరి అస్త్రం ప్రయోగించాడు.

"ఓస్ ! అదా !'' పకపక నవ్వింది. "ఎంత పిచ్చివారండీ !'' మళ్లీ నవ్వింది రత్నం. "మీరెంత అమాయకులండీ ! ఇంత ఖర్చుచేసింది అందుకా ?'' రత్నానికి నవ్వాగింది కాదు. ఎలాగోలా నవ్వు మధ్య భర్తకు అసలు విషయం చెప్పింది.

"ఆ రోజు వుదయం ప్రక్కింటి పిన్నిగారు పిలిచారు. ఎందుకోనని వెళ్లాను.''

"ఏమమ్మా ! రత్నం ! ఏమిటి మరీ నల్లపూసవయ్యావు ! కంటికి కనిపించటంలేదే !'' అంటూ అసలు విషయం మొదలు పెట్టారు.

"ఏంలేదమ్మా ! మావారు నాకు సంగీతం నేర్పిస్తానన్నారు ! మాస్టారుగారిల్లు చాలా దూరమట. ఒక్కదాని కొరకు రావటం కష్టమౌతుందని అన్నారు. మరి నువ్వు కూడా చేరతానంటే, ఇద్దరం నేర్చుకుందాం ! ఇప్పుడు సంగీతానికి ఎంత విలువుందని ! అందులో నీ గొంతు కమ్మగా వుంటుంది,'' అన్నారు పిన్నిగారు.

"మా వారినడిగి చూస్తానండీ'' అన్నాను.

ఆ రోజు నేను ఆ విషయమే అడుగబోయాను కాని మీరు నన్ను సొంతం చెప్పనిస్తేగా ? సంగీతం విషయం చెపితే మీరు నవ్వుతారేమోనని అలా సిగ్గుపడ్డాను. కాని మీరు నా సిగ్గును మరో విధంగా అర్థం చేసుకున్నారు ! తరువాత రోజు పిన్నిగారే అన్నారు "తను నేర్చుకోవటం లేదని, ఎందుకమ్మా సంగీతం ? కచ్చేరీలు చేస్తామా, ఏమ్మన్నానా ?''

నాకు నవ్వాగిందికాదు. అంతటితో నా సంగీత కార్యక్రమం ముగిసింది. మీ వద్ద మరలా ఆ ప్రస్తావన తీసుకురాలేదు.

అదీ సంగతి ! ! !

రత్నం వంటగదిలోకి దూరింది.

సుబ్బారావు చెవుల్లో ఇంకా రత్నం మాటలు గింగురు మంటున్నాయి !

"అయ్యో ! భగవంతుడా ! ఆ రోజు సంతోషంలో ఎంత ఖర్చు చేశానో !''

"ఎలాగైతేనేం ? ఈ ఐదు నెలలు రత్నం రాజభోగం అనుభవించింది'' అనుకున్నాడు నిట్టూరుస్తూ !

చివరకు తన తప్పేమిలేదన్నట్లు—

"ఆడవాళ్ల చేష్టలకు అర్థాలేవేరులే !'' అని అనుకున్నాడు సుబ్బారావు.

ప్రగతికి మూలం

క్రమశిక్షణ